క్లుప్తంగా

గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

డెంకాడ: గ్రంథాలయాల్లో విజ్ఞానాన్ని పెంచే విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, పాఠకులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి వై.మహేష్ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కథల పుస్తకాలు, ముఖ్యుల జీవిత చరిత్రలు, తదితర పుస్తకాలు ఉన్నాయని, వాటిని చక్కగా చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. విద్యార్థులకు లైబ్రేరియన్ మహేష్ తన సొంత డబ్బులతో అల్పాహారం అందజేశారు.

రామాయణంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రస్టు సభ్యులు

విజయనగరం రూరల్: రామాయణంపై విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్‌సీఎస్ ట్రస్ట్ సభ్యురాలు గౌరీనిత్య అన్నారు. రామనారాయణం ప్రాంగణంలో జిల్లా కేంద్రానికి చెందిన పలువురు డిగ్రీ విద్యార్థులకు రామాయణంపై ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌ను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో రీసెర్చ్ కేంద్ర నిర్వాహకురాలు హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

12న అన్నసమారాధన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి జాతర మహోత్సవాలు పూర్తయిన నేపథ్యంలో అమ్మవారి చదురుగుడి ఆలయ ఆవరణలో ఈ నెల 12న భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఎరుకొండలో ఎమ్మెల్యే పర్యటన



ఎరుకొండలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం పర్యటించారు. గ్రామంలో డయేరియా ప్రబలడంతో రెండు రోజులుగా వైద్యారోగ్య శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు సేవలందిస్తున్నారు. సుమారు వంద మంది అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి డయేరియా బాధితులకు సేవలందిస్తుండడంతో పాటు పారిశుధ్య, తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. ఎరుకొండ, పరసాం, మర్రిపేట గ్రామాల్లో డయేరియా అదుపులో ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే లోకం నాగమాధవి గ్రామంలో పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. బాధితులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం. రాధిక, వైద్యులు రాజేష్‌వర్మ, సుబ్రహ్మణ్యం, ఈఓ పీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, వైద్య సిబ్బంది ఆర్‌వీ రమణ, జి. బంగారుబాబు, సర్పంచ్ జి. అప్పలస్వామి, తదితరులున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జామి: మండల కేంద్రంలోని అల్లువీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.ఏ.వి.ఆర్.కె.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు ఆధ్వర్యంలో మండల కమిటీ నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా కొత్తలి వెంకటరావు, అధ్యక్షుడిగా వి.వాసుదేవరావు, సహాధ్యక్షులుగా ఐ.వి.రమణ, ఎం.రూపవతి, ప్రధాన కార్యదర్శిగా ఎం.తాతం నాయుడు, కోశాధికారిగా బి.శ్రీధర్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

అన్నదానం

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి పట్టణంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అలాగే ప్రతీ ఆదివారం మాదిరిగానే ఆలయ అర్చకులు ఉదయం నాలుగు గంటలకు అమ్మవారికి పంచామృతాభి షేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి, పూజలు చేసి, భక్తులను దర్శనానికి అనుమతించారు.

- పట్టించుకోని పర్యాటక శాఖ
- ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకున్న రిసార్ట్స్, హోటల్స్
- లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృథా



ప్రారంభించకుండా వదిలేసిన పర్యాటక భవనాలు

చింతపల్లి బీచ్‌లో... అభివృద్ధి అంతంతమాత్రమే



చింతపల్లి బీచ్

పూసపాటిరేగ: చింతపల్లి బీచ్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. లక్షలాది రుపాయలు వెచ్చించి పర్యాటకుల విడిది కోసం రిసార్ట్సు, హోటల్స్ నిర్మించారు. అయితే ఆ భవనాలను ప్రారంభించక పోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. జిల్లాలో ఏకైక తీర ప్రాంతమైన చింతపల్లి బీచ్‌ను పర్యాటకంగా గతంలోనే తీర్చిదిద్దారు. సుమారు కోటి రుపాయలతో భవనాలు నిర్మించినప్పటికీ నిర్లక్ష్యంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకుని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఈ ఏడాది కార్తీకమాసంలో అయినా కూటమి ప్రభుత్వం భవనాలను ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తారని ఆశించినప్పటికీ ఫలితం లేకపోయింది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో చింతపల్లి బీచ్‌కు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. అయితే రిసార్ట్స్, హోటల్స్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పర్యాటక అధికారులు బీచ్ అభివృద్ధి వైపు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్మించారు.. వదిలేశారు..

గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 2009లో చింతపల్లి బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అడుగులు పడ్డాయి. ముందుగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్, ఫంక్షన్‌హాల్, ప్లాట్‌ఫారాలు నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం పర్యాటకుల కోసం భవనాలు నిర్మించినప్పటికీ నిర్వహణను మరిచారు. దీంతో ఆ భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అయినా భవనాల ఊసెత్తడం లేదు. దీంతో బీచ్‌కు వచ్చే పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ఏడాది కార్తీకమాసంలో అయినా పర్యాటక భవనాలు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

చింతపల్లి టూరిజం భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఈ ఏడాది కార్తీకమాసంలో అయినా పర్యాటకశాఖ అధికారులు భవనాలను అందుబాటులోకి తీసుకురావాలి. జిల్లాలో ఏకైక తీర ప్రాంతాన్ని అధికారులు అభివృద్ధి చేయాలి.

– బి. చినఅప్పన్న , చింతపల్లి

కోడ్ కూసింది.. ముసుగు పడింది

- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అమల్లోకి వచ్చిన కోడ్
- రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు
- నేటి కార్పొరేషన్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు



రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేస్తున్న సిబ్బంది

విజయనగరం: మళ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. సార్వత్రిక ఎన్నికలు జరిగి ఆరు నెలల వ్యవధిలోనే మరోసారి ఎన్నికల వేడి సంతరించుకోనుంది. ఉమ్మడి విజయనగరం జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల నియమావళి ప్రకారం అధికారులు చర్యలు ప్రారంభించారు. నగరంలోని పలు ప్రధాన జంక్షన్‌లతో పాటు పలు ప్రాంతాల్లో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కోడ్ నియావళిని అమలు పరిచారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 50 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకు ఈ కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలంతా విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

శాప్ చైర్మన్ పర్యటన రద్దు

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో సోమవారం విజయనగరం జిల్లాకు రావాల్సిన శాప్ చైర్మన్ పర్యటన రద్దయినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో గల విజ్జి, రాజీవ్ క్రీడామైదానాల్లో సదుపాయాల పరిశీలనకు రావాల్సి ఉండగా కోడ్ వల్ల రద్దయిందని పేర్కొన్నారు. ఎన్నిక తర్వాత పర్యటించే అవకాశం ఉందన్నారు.

• చురుగ్గా పూడికతీత పనులు



కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చురుగ్గా చేపడుతున్నారు. గణేష్‌కోవెల దరి, కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న ప్రధాన కాలువల్లో జేసీబీల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఆదివారం తొలగించారు. కొన్నిచోట్ల పారిశుధ్య సిబ్బంది కాలువల్లో దిగి చెత్తను తొలగించారు.

– విజయనగరం

శివపూజకు సిద్ధం..

- ముస్తాబైన శివాలయాలు
- కార్తీకమాన తొలి సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు



ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాక్షల అలంకరణలో శివయ్య



పశుపతి నాథేశ్వరాలయంలో స్ఫటికలింగాకారుడు

విజయనగరం టౌన్: కార్తీకమాసం తొలి సోమవారం పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబయ్యాయి. మహాశివుని దర్శించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎస్‌వీఎన్ నగర్‌లో కొలువైన విజయగణపతి ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అపర్ణాదేవీ సమేత పశుపతినాథేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం మహోత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తొలి సోమవారం పురస్కరించుకుని ఉదయం 4 గంటల నుంచి స్పటిక లింగానికి క్షీరాభిషేకాలు, ఆలయ ప్రాంగణంలో సామూహిక రుద్రాభిషేకాలు చేపడతారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారికి వృషభ వాహన సేవ నిర్వహిస్తారు. అదేవిధంగా స్థానిక శివాలయం వీధిలో గల అతిపురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయం, కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గాజులరేగలోని ఉమారామలింగేశ్వరస్వామికి వేకువజామునుంచే అభిషేకాలు, అర్చనలు చేపడతామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

శతశాతం ట్రేడ్ లైసెన్స్‌లు..




సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: నగర పరిధిలో వ్యాపార, వాణిజ్య దుకాణాలకు శతశాతం ట్రేడ్ లైసెన్స్‌ల విధింపే లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్‌ల విధింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేసేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు తన కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు, తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఆరుబయట చెత్త వేసిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అదేవిధంగా ప్రతీ వాణిజ్య దుకాణానికి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఇదివరకే ట్రేడ్ లైసెన్సులు పొందిన వారు రెన్యువల్ చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణాలకు గ్రహణం

- ఎస్.కోట నియోజకవర్గంలో అర్ధంతరంగా నిలిచిన పీహెచ్‌సీల భవన నిర్మాణాలు
- గత ప్రభుత్వంలో 5 పీహెచ్‌సీలకు రూ.8.25 కోట్లతో నూతన భవనాలు మంజూరు
- ఎన్నికలకు ముందే జామి, ఎల్.కోటలో 90 శాతానికి పైగా, అలమండ, వియ్యంపేట, కొత్తవలసలో 70 శాతం మేర పనులు పూర్తి
- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుకు సాగని మిగిలిన పనులు
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది



జామిలో విద్యుద్దీకరణ పనులు పూర్తికాని పీహెచ్‌సీ నూతన భవనం



ఎన్నికలకు ముందే తొంబై శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయిన ఎల్.కోట పీహెచ్‌సీ భవనం



కొత్తవలసలో అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణం

కొత్తవలస: ప్రజారోగ్యానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, అభివృద్ధి చేయడంతో పాటు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచింది.అవసరమైన చోట నూతన భవనాలను మంజూరు చేశారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని జామి, ఎల్.కోట అలమండ,వియ్యంపేట, కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో నాడు–నేడులో భాగంగా జగన్ సర్కారు రూ.8.25 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో పీహెచ్‌సీలో రూ.1.65 కోట్లతో అన్ని సదుపాయాలతో కూడిన భవనాల నిర్మాణానికి టెండర్లు పూర్తి కాగా, కాంట్రాక్టర్లు పనులు కూడా ప్రారంభించారు. ఇరుకు గదులు, శిథిల భవనాల్లో కాలం వెళ్లదీస్తున్న పీహెచ్‌సీలకు ఇక కొత్త శోభ రానుందని, అరకొర సౌకర్యాల మధ్య సేవలందిస్తున్న తామంతా మరికొన్ని నెలల్లో కొత్త భవనాల్లోకి అడుగు పెట్టబోతున్నామని సిబ్బంది ఆశ పడ్డారు. అయితే వారికి నిరాశే ఎదురైయింది.భవన నిర్మాణాలు తుదిదశకు చేరుకుంటున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భవన నిర్మాణాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

శరవేగంగా సాగిన నిర్మాణాలకు అడ్డుకట్ట

గత ప్రభుత్వంలో ఆస్పత్రుల భవనాల నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. జామి,లక్కవరపుకోట పీహెచ్‌సీల భవనాలు 90 శాతం పూర్తయ్యాయి. పెయింటిగ్ పనులను సైతం ఎన్నికలకు ముందే పూర్తి చేశారు. కేవలం ప్లంబింగ్, విద్యుద్దీకరణ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అలమండ, వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల భవనాల నిర్మాణం 70శాతంకు పైగా పూర్తయ్యాయి. నిర్మాణాలు శరవేగంగా సాగుతున్న సమయంలో ప్రభుత్వం మారడంతో పనులకు ఫుల్ స్టాప్ పడింది.కూటమి అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా ఈ నిర్మాణాల సంగతి పట్టించుకున్న దాఖలాలే లేవు. కొత్తవలసలో పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరడంతో చెంతనే ఉన్న ఎన్‌జీఓ కార్యాలయంలో, వియ్యంపేటలో పీహెచ్‌సీని గతంలో సాంఘిక సంక్షేమ హాస్టల్ కోసం వినియోగించిన భవనం లో నిర్వహిస్తున్నారు. ఈ భవనాల్లో సరైన సౌకర్యాలు, మంచాలు లేక రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి నిర్మాణాలను పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తేవాలని ఆయా పీహెచ్‌సీల పరిధి ప్రజలు కోరుతున్నారు.



కొత్తవలసలో తాత్కాలిక భవనంలోని ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

పనులను త్వరగా పూర్తి చేయాలి



ఆస్పత్రుల భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. పనులను పూర్తిచేస్తే గత ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనో, మరే ఇతర కారణమో తెలియదు కానీ నాడు–నేడులో భాగంగా మంజూరైన పీహెచ్‌సీల భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఈ ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం దారుణం. కొత్తవలస పీహెచ్‌సీ తాత్కాలిక భవనంలో సౌకర్యాలు లేక ఆరుబయట, ఇరుకు గదుల్లో వైద్యసిబ్బంది సేవలందిస్తున్నారు.రోగులు ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పనులను పూర్తి చేయించాలి.

– పెదిరెడ్ల శ్రీనివాసరావు, కొత్తసుంకరపాలెం, కొత్తవలస మండలం

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి



లక్కవరపుకోట, జామి పీహెచ్‌సీల భవన నిర్మాణాలు 90 శాతానికి పైగా, అలమండ, వియ్యంపేట, కొత్తవలసలో 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. సుమారు రూ.2 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. నిలిచిపోయిన నిర్మాణాలపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈ

వృద్ధాశ్రమానికి విరాళం

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమానికి మండలంలోని విజయరాంపురం(రేగిడిపేట) గ్రామానికి చెందిన పి.శంకరరావు, ఇందు దంపతులు రూ.10 వేలు విరాళం అందజేశారు. తమ కుమార్తె పుట్టిన రోజున పురస్కరించుకుని ఆశ్రమంలో శాశ్వత అన్నదాన నిర్వహణ కోసం విరాళం అందించామని దాతలు చెప్పారు. ఆశ్రమ నిర్వా హకుడు కోట్ల లక్ష్మణరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆశ్రమ నిర్వాహకుడు లక్ష్మణరావుకు నగదు అందజేస్తున్న .శంకరరావు, ఇందు దంపతులు